క్లుప్తంగా

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు



విద్యార్థినులతో యోగాసనాలను వేయిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఆదివారం బాలల హక్కుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధా వరలక్ష్మి ఆదేశాలతో జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థినులకు యోగాసనాలను నేర్పించారు. బాలల హక్కులు, బాల్యవివాహాల నియంత్రణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ శివలత, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సోషల్ వర్కర్ వనజాక్షి, లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఆదివారం బుక్కపట్నంలోని కస్తూర్బా పాఠశాలలో బాలల హక్కులు, పరిరక్షణపై అవగాహన కల్పించారు.

బీసీ హాస్టల్‌లో నీటి కష్టాలు తీర్చండి



బీసీ హాస్టల్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో నీటి కష్టాలు తీర్చాలని బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి అధికారులను కోరారు. ఆదివారం బీసీ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో హాస్టల్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ వసతి గృహంలో 140 మంది విద్యార్థినులున్నారన్నారు. నీటి సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు సార్లు అర్జీలు ఇచ్చినా వారి నుంచి పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్ పరిసరాల్లో ముళ్ల పొదలు పెరగడంతో విషపురుగుల బెడద ఎక్కువగా ఉందన్నారు. అధికారులు స్పందించి హాస్టల్‌లో మౌలిక వసతులను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ నాయకుడు రాఘవేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనభోజనం



ఉసిరి చెట్టు వద్ద నేతి దీపాలను వెలిగిస్తున్న మహిళలు

బత్తలపల్లి: సంజీవపురం వద్దనున్న అనంతలక్ష్మీ విద్యాసంస్థల అధినేత ముళ్లగూరు అనంతలక్ష్మీ రాముడు ఉసిరి తోటలో ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అనంతపురం, బత్తలపల్లి, సంజీవపురం గ్రామాలకు చెందిన వారు ఉసిరి చెట్టు కింద ఉసిరికాయలపై నేతితో దీపాలు వెలిగించారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, అనంతలక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ముళ్లగూరు సురేంద్రనాయుడు, డయాబెటీస్ వైద్యుడు డాక్టర్ సతీష్, గ్రామపెద్దలు ముళ్లగూరు వెంకటేష్, అయ్యప్పనాయుడు, నెట్టెం క్రిష్ణమనాయుడు, ముళ్లగూరు చిరంజీవి, ముళ్లగూరు రామాంజనేయులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కదిరి టౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ధ్యాన మందిరంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన సాగర్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్యాస్ట్రిక్, న్యూరాలజీ, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు దాదాపు 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని బెంగళూరుకు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు నరేష్, జి.ఎం.సుముఖ, ప్రమోద్, కె.మునీంద్ర, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తాయి నితిన్, సెక్రటరీ నాగార్జున, సభ్యులు రాఘవేంద్ర, కిశోర్‌రెడ్డి, సి.వి.మదన్‌కుమార్, తాహెర్‌వలి, రంజిత్, పృథ్వీరాజ్, బాబా పక్రోద్దీన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు.. రైతులకు దిగులు



ధర్మవరం చెరువు ఆయకట్టు భూముల్లో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు



చెరువు కాలువలలో భవన శిథిలాలను వదిలిన దృశ్యం



పోతుకుంట చెరువు కింద పూడిపోయిన నీటి కాలువలు

- చెరువుల్లో పేరుకుపోయిన కంపచెట్లు
- పూడిపోయిన ఆయకట్టు కాలువలు
- చెరువుల్లో నీళ్లున్నా ప్రయోజనం సున్నా
- ఉపాధి హామీ కింద ముళ్లపొదలు తొలగించాలంటున్న రైతులు

ధర్మవరం రూరల్: చెరువులో నీళ్లున్నందుకు సంతోషపడాలో ఆయకట్టు భూముల్లో ముళ్లపొదలు పేరుకుపోయినందుకు బాధపడాలో అన్నదాతలకు అర్థంకావడం లేదు. అల్పపీడనం కారణంగా ఇటీవల వర్షాలు ధర్మవరం నియోజకవర్గంలో దంచికొట్టాయి. దీంతో నియోజకవర్గంలోని చెరువులలో నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. ఆయకట్టు భూముల్లో ఏపుగా ముళ్ల పొదలు విస్తరించాయి. అయితే పంటలను ఎలా సాగు చేసుకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ముళ్ల పొదలను తొలగించుకోవాలంటే ఎకరానికి రూ.30 నుంచి రూ. 40 వేల దాకా పెట్టుబడులు వస్తాయి. అసలే డబ్బుల్లేక అల్లాడుతున్న రైతాంగం ముళ్ల పొదలను ఎలా తొలగించుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

పూడిపోయిన చెరువు కాలువలు

చెరువు నుంచి ఆయకట్టుకు నీళ్ల సరఫరా అయ్యే కాలువలు వ్యర్థాలు, శిథిలాలతో పూడుకుపోయాయి. ముఖ్యంగా ధర్మవరం, పోతుకుంట, గొట్లూరు చెరువులు పట్టణానికి దగ్గరగా ఉన్నాయి. పట్టణంలో తొలగించిన భవనాల శిథిలాలను ట్రాక్టర్ల ద్వారా చెరువు కాలువల్లో వదులుతుండడంతో అవి పూడిపోతున్నాయి. కాలువలను మరమ్మతులు చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు పూడికతో పూడిపోవడంతో వరి పైరును పోసుకునేందుకు మంచి అదను కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీనే దిక్కు..

చెరువు ఆయకట్టు పొలాల్లో విస్తరించిన ముళ్ల పొదలను ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఉపాధి ద్వారా పనులు చేయిస్తే అటు కూలీలు, ఇటు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముళ్ల పొదలను తొలగించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తే బాగుంటుందని రైతులు అంటున్నారు. ఉపాధి కూలీల ద్వారా కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని కోరుతున్నారు.

రైతులు, కూలీలకు ప్రయోజనకరం

చెరువులలో నీరు పుష్కలంగా ఉంది. ఆయకట్టు భూముల్లో మాత్రం ముళ్ల పొదలున్నాయి. వీటిని తొలగించుకొని పంటలను సాగు చేయాలంటే రైతులకు ఖర్చుతో కూడిన పని. ఉపాధి హామీ ద్వారా ముళ్ల పొదలను తొలగించినట్లయితే అటు రైతులకు ఇటు కూలీలకు ఎంతో ఉపయోగకరంగా వుంటుంది.

–పోతులయ్య, ధర్మవరం ఆయకట్టు రైతు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

చెరువు ఆయకట్టు భూముల్లో విస్తారంగా ముళ్ల పొదలున్నాయి. వీటిని ఉపాధి హామీ ద్వారా తొలగించాలని పలువురు రైతులు కోరుతున్నారు. అయితే ఆయకట్టు భూముల్లో ముళ్ల పొదలు తొలగించడానికి మాకు ఎటువంటి ఆదేశాలు లేవు. కూలీలు, రైతుల నుంచి ఎక్కువగా ఈ విషయంపై వినతులు వస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

–అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ, ధర్మవరం మండలం

ధర్మవరం మండలంలోని చెరువులు, ఆయకట్టు వివరాలు..

చెరువులు	ఆయకట్టు విస్తీర్ణం (ఎకరాల్లో)
ధర్మవరం	1922
గొట్లూరు	542
రావులచెరువు	488
రేగాటిపల్లి	155
పోతుకుంట	218
అప్రాచెరువు	375

బాధితులకు పరామర్శ



ఉప్పార్లపల్లిలో నారాయణమ్మను పరామర్శిస్తున్న పూల శ్రీనివాసరెడ్డి.

నల్లచెరువు: ఇటీవల గుండె పోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఉప్పార్లపల్లికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నేత పఠాన్ బాబాఖాన్‌ను వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. బాబాఖాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత పోలం మాధవరెడ్డి తల్లి నారాయణమ్మ ఇంట్లో జారి పడి గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా ఆమెను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథ నాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ, నాయకులు పోలం సూర్యశేఖర్‌రెడ్డి, కల్లిపల్లి శ్రీనివాసులు, గపూర్‌సాబ్, సిద్దారెడ్డి, హైదర్ వలి, రహంతుల్లా ఖాన్, ప్రభాకర్‌రెడ్డి, వార్డు మెంబర్ నాగరాజు, రమణారెడ్డి, అజీద్ బాషా, మన్సూర్ బాషా, రామాంజనేయులు, హైటెక్ రమణ, అమర్‌నాథ్‌రెడ్డి, రమణ, అంజి వాల్మీకి, కరీం, ఆంజనేయులు, మహేంద్ర, చిన్న రెడ్డెప్ప, రసూల్ సాబ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి



డీఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కదిరి అర్బన్: విద్యార్థి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పుట్టపర్తి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ప్రేమ్ సాయి అనే విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేయడంతో మృతి చెందాడన్నారు. విద్యార్థి గాయాలతో ఉన్నప్పుడు కనీసం ఆసుపత్రికి కూడా కళాశాల యాజమాన్యం తీసుకుపోలేదని ఆరోపించారు. చనిపోయిన విద్యార్థి తోటి విద్యార్థుల సాయంతో హిందూపురంలోని ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడన్నారు. పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారని, అయితే అప్పటికే విద్యార్థిమృతి చెందాడన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్, విజయ్‌కుమార్, అఖిల్,భానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ మేనేజర్ బదిలీ

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న హరిత ఆదివారం బదిలీ అయ్యారు. పుట్టపర్తి రీజనల్ మేనేజర్ కార్యాలయానికి ఆమెను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కదిరి డిపోలో హరిత 2019లో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)గా విధుల్లో చేరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల కేంద్రంలోని బైపాస్ వద్ద ఆదివారం త్రుటి ప్రమాదం తప్పింది. వివరాలు.. అనంతపురం నుంచి పుంగనూరుకు వెళ్తున్న ఐచర్ వాహనం వేగంగా వస్తుండగా మైన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిబ్బంది వాహనాన్ని ఆపారు. ఇదే సమయంలో కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైపాస్‌లో రోడ్డు క్రాస్ చేస్తూ ఉన్నఫలంగా ఆగిన ఐచర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ కెఎస్ రెడ్డి గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణీకులందరూ క్షేమంగా బయటపడ్డారు. అనంతరం ఇరువర్గాల వారు రాజీ అయి కేసు లేకుండా ఎవరిదారిన వారు పోయినట్లు తెలిసింది. ప్రమాదంతో ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం కలిగింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆశా వర్కర్ల ధర్నా జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం: పుట్టపర్తిలోని కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగే ఆశావర్కర్ల ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో–కన్వీనర్లు ఆయూబ్‌ఖాన్, సీపీఎం సీనియర్ నేత ఎస్‌హెచ్ బాషా, ఆశావర్కర్ల యూనియన్ నేతలు ఇర్ఫానా, నారాయణమ్మ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్లకు సంబంధంలేని పనులు చేయించరాదని, ఆశా వర్కర్ల నియామకంలో రాజకీయ జోక్యం ఉండరాదన్నారు. సెలవులు, ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేలా వెంటనే జీఓ విడుదల చేయాలన్నారు. కనీస వేతనం అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఏఎన్‌ఎం పోస్టుల భర్తీల్లో ఆశా వర్కర్లకు వెయిటేజ్ ఇవ్వాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ జీఓ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ జీఓను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ కమిటీల ద్వారా వర్కర్లను తొలగించరాదని డిమాండ్ చేశారు.

పీఈటీ రమేష్‌కు ఘన నివాళి



మృతుల ఫొటోల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: రోడ్డు ప్రమాదంలో పీఈటీ రమేష్, ఆయన కుమార్తె సాయి భవిత మృతి చెందడం బాధాకరమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. రమేష్, సాయి భవిత చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని తోటి మిత్రులు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, వెంకటకిశోర్, శ్రీనివాసులు, నారాయణస్వామి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి హిదయ్‌తుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులేసు, ఆకులేటి రమేష్, రఘునాథ్‌రావు, నాగేంద్ర, శివకృష్ణ, గోవిందు, రమేష్, 1992–93 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు రాయపాటి రామకృష్ణ, జయం రాఘవ, రంజిత్‌కుమార్, రవికుమార్, మల్లికార్జున, గిరి, రామ్మోహన్‌నాయుడు, గోల్డ్ హిద్దు, బొగ్గు వెంకటేష్, బిల్లే ప్రసాద్, మైఖేల్, దామోదర్, బాబా, మల్లికార్జున, కపాడం శ్రీనివాసులు, గుర్రం రామంజినేయులు, రమణారెడ్డి, రామచంద్ర, హాకీ కోచ్ అనిల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ టీచర్ మృతి



సురేష్ నాయుడు (ఫైల్)

కనగానపల్లి: నెలన్నర రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంట్రాక్టు టీచర్ సురేష్ నాయుడు (32) ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కనగానపల్లికి చెందిన సురేష్‌నాయుడు స్థానిక మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ టీచర్‌గా కాంట్రాక్టు కింద పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 29వ తేదీన అనంతపురం నుంచి కనగానపల్లికి ద్విచక్ర వాహనంలో వస్తూ మామిళ్లపల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని తొలుత చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అనంతరం బెంగుళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. కాని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శోభారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



గాండ్లపెంట ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కనగానపల్లి గ్రంథాలయంలో మాట్లాడుతున్న కవి దాసిరెడ్డి



బత్తలపల్లిలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు కాటమయ్య

గాండ్లపెంట: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గ్రంథాలయాధికారిణి ఫరియాబాను సూచించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాలు–సమాజంపై వాటి ప్రభావం' అనే అంశంపై వ్యాస రచనపోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బత్తలపల్లి: స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను చైతన్య పరచడానికి ఈ గ్రంథాలయోద్యమం తోడ్పడిందని శ్రీజ్యోతి హైస్కూల్ ఉపాధ్యాయులు కాటమయ్య, మహమ్మద్ రఫి పేర్కొన్నారు. ఆదివారం బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హై స్కూల్‌లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శాఖా గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్‌ఆర్ రంగనాథన్, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలుగు సాహిత్యాన్ని మరవకూడదు

కనగానపల్లి: పర భాషలు ఎన్ని నేర్చుకున్నా తెలుగు భాషా సాహిత్యాన్ని మరవకూడదని పలువురు రచయితలు, ఉపాధ్యాయులు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక రచయితలు దాసిరెడ్డి, తిప్పయ్య, పుల్లన్న తదితరులు తెలుగు భాషా, సంస్కృతి, సాహిత్యాన్ని కవితల రూపంలో విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష ఎంతో గొప్పదని.. బతుకుదెరువు కోసం పర భాషలు నేర్చుకోవాలని సూచించారు. అయితే మాతృభాషను ఎప్పుడూ మరవకూడదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గోవిందు, గ్రామస్తులు నాగభూషణ. మురళీ, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గ్రంథాలయాధికారి శీనా నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల20 గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ రోజామణి, హిందీ పండిట్ ప్రతిభ భారతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: కుటుంబాన్ని పట్టించుకోని భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. యర్రదొడ్డికి చెందిన నాగశేషయ్య కడప విద్యుత్‌శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఆయన కుటుంబ ఖర్చులకు కూడా డబ్బు ఇవ్వడని, పిల్లల స్కూల్ ఫీజులకు కూడా కట్టడం లేదు. నాగశేషయ్య భార్య ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు.



శిథిలావస్థకు చేరిన పెడపల్లి ప్రాథమిక పాఠశాల భవనం



నిరుపయోగంగా సాతార్లపల్లి ప్రాథమిక పాఠశాల భవనం

నిర్లక్ష్యపు ఆనవాళ్లు.. ఈ భవనాలు..



సాతార్లపల్లిలో పశువుల పాకగా మారిన తరగతి గది

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పలు పాఠశాలల భవనాలను చాలా ఏళ్లుగా వినియోగంలో లేక పోవడంతో పూర్తి శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామం నడిబొడ్డులో ఉండడంతో స్థలాలు ఆక్రమించుకుంటారని ప్రజలు వాపోతున్నారు. సదరు శిథిల భవనాలను సైతం ఇతరులు ఆక్రమించుకొని వాటిని పశువుల పాకలుగా మార్చారు. దీంతో పాటు అందులోని సామగ్రిని మాయం చేశారు. ఒకప్పుడు విద్యార్థులకు దేవాలయాలుగా మారిన పాఠశాలలు ప్రస్తుతం మందు బాబులకు అడ్డాలుగా మారాయి. చీకటి పడగానే శిథిల భవనాల్లో చేరుకొని మందు సేవిస్తూ ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇతరులు నివాసంగా మార్చుకున్న గంగిరెడ్డిపల్లి తండా పాఠశాల భవనం

పేకాటరాయుళ్ల అరెస్ట్

తనకల్లు: వంకపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.4,060 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థిని అదృశ్యం

కదిరి అర్బన్: కదిరి మండలానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని కనిపించడం లేదని బాలిక తండ్రి ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన ఒక యువకునిపై అనుమానం ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు.